సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



పట్టపగలే దొంగతనం

కౌటాల మండల కేంద్రంలో ఓ ఇంట్లో గురువారం పట్టపగలే దొంగతనం జరిగింది. ఇంటి తాళం పగలగొట్టి ఐదు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. 8లో ▸



అడవి శిలాజాన్ని ఆదరించరూ!

కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లో ప్రాణహిత తీరంలో డైనోసర్‌ల జాడలు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ వృక్ష, జంతు శిలాజాలపై ఏళ్లుగా పట్టింపు కరువైంది. 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.5 /28.5

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. వేడి గాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:31	శని : 4:42

న్యూస్‌రీల్

నేడు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ జయంతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని లుంబినీ దీక్ష భూమి వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

18 నుంచి సదరం క్యాంపులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 18 నుంచి 25 వరకు సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న ఎముకల వైకల్యం, 19న మూగ, చెవిటి, 20న మానసిక వైకల్యం, 25న కంటిచూపు వైకల్యం ఉన్న వారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్యాంపులకు హాజరయ్యే ముందు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రంలో వికలాంగత్వం పరీక్ష చేయించుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య పరీక్ష చేయించుకున్న పత్రాలతో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ క్యాంపులకు హాజరు కావాలని కోరారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రామకృష్ణ

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే మైక్రోఫైలేరియా సర్వేను వైద్యసిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం వైద్యసిబ్బందికి సర్వేపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించాలన్నారు. ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

పెంచికల్‌పేట్(సిర్పూర్): ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. రికార్డులు, ప్రసూతి గది, ల్యాబ్, మెడికల్ గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని, పౌష్టికాహారం కిట్లు అందించాలని సూచించారు. కోవిడ్ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి అమన్, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, తదితరులు

కాగజ్‌నగర్‌టౌన్: ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. స్పర్శ ఫౌండేషన్(ఎస్పీఎం), సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్పీఎం ట్రైనింగ్ సెంటర్ హాల్‌లో గురువారం మండలంలోని 11 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగించడంతో పర్యావరణంలోకి కాలుష్యం వెదజల్లే ప్రమాదముందన్నారు. డీఆర్‌డీవో సురేశ్‌కుమార్, ఎంపీడీవో గౌరీశంకర్, ఎస్‌బీఎం ఫణికుమార్, ఏపీఎం ముక్తేశ్వర్, ఎస్పీఎం జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి, ఎస్పీఎం చీఫ్ మేనేజర్ రమేశ్‌రావు, తుమ్మ రమేశ్, సీఈఈ ప్రాజెక్టు అధికారి విద్యభూషన్, వినల్, సుధీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దున దందా



పోడ్సా సరిహద్దు గ్రామంలో నూతనంగా ప్రారంభమైన పశువుల సంత

- జిల్లా సరిహద్దులోని మహారాష్ట్ర గ్రామాల్లో ప్రత్యేకంగా పశువుల సంతలు
- వ్యాపారుల కనుసన్నల్లోనే క్రయవిక్రయాలు!
- అక్రమ దందాలకు ఇవే కీలకం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

సిర్పూర్(టి): తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దుల్లో కొత్తగా పశువుల సంతలు వెలుస్తున్నాయి. కొంత మంది వ్యాపారులు సరిహద్దులోని సంతలతోపాటు జిల్లాలోని పశువుల సంతలను అక్రమ దందాలకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను క్రయవిక్రయాలు నిర్వహిస్తూ వారసంతల నుంచి అనుమతి పత్రాలు సృష్టిస్తున్నారు. వాహనాల్లో పరిమితికి మించి మూగజీవాలను తరలిస్తూ లాభాలు అర్జిస్తున్నారు. సరిహద్దులోని గ్రామ పంచాయతీలను తమ దందాకు అడ్డాలుగా ఎంచుకుని సంతలు ఏర్పాటు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

అంతర్రాష్ట్ర సరిహద్దుల వెంబడి..

జిల్లాలోని కౌటాల, జైనూర్, వాంకిడి మండలం గోయగాం గ్రామాల్లో గతం నుంచి పశువుల సంతలు కొనసాగుతున్నాయి. ఇక్కడి నుంచి పశువులను కొనుగోలు చేసి పట్టణాలతోపాటు హైదరాబాద్‌కు రవాణా చేసేవారు. ఇటీవల సిర్పూర్(టి) మండల కేంద్రంలో పశువుల సంతను మూసివేశారు. నూతనంగా సిర్పూర్(టి)– మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో హుడ్కిలి గ్రామంలో పశువుల సంతను ప్రారంభించారు. అలాగే వెంకట్రావ్‌పేట్– పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలో మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా పోడ్సా గ్రామ పంచాయతీ పరిధిలో నెల రోజుల క్రితం పశువుల సంతను నూతనంగా ఏర్పాటు చేశారు. ఇదే రహదారిలో ధరూర్‌లో సైతం పశువుల సంత కొనసాగుతోంది. మహారాష్ట్రలో కేవలం వ్యవసాయానికి వినియోగించే పశువుల విక్రయానికే అనుమతులు ఉన్నాయి. కుమురంభీం జిల్లాలోని పశువుల సంతల్లో వ్యవసాయానికి ఉపయోగించే పశువులతోపాటు ఇతర పశువుల క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ నెలలో దాదాపుగా అన్ని పశువుల సంతల వేలం పూర్తయింది. అంతర్రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోనే సంతలు ఏర్పాటు చేస్తుండటం విశేషం.

పశువుల వ్యాపారుల సిండికేట్..

జిల్లాలోని పశువుల సంతల వేలంలో పశువుల వ్యాపారులు సిండికేట్ అవుతున్నారు. సంతలను దక్కించుకుని పరస్పరం సహకరించుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సంతలను నిర్వహించడంతోపాటు పశువుల రవాణాకు వినియోగించుకుంటున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, వాంకిడి, ఆసిఫాబాద్ పట్టణాలకు చెందిన కొందరు వ్యాపారుల చేతుల్లోనే జిల్లాలోని పశువుల సంతలు కొనసాగుతున్నట్లు సమాచారం. నిబంధనల మేరకు పశువులకు ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా వాహనాల్లో పరిమితికి మించి పశువులను తరలిస్తున్నారు. అడపాదడపా అధికారులు చేస్తున్న తనిఖీల్లో వీరి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలోని సరిహద్దు గ్రామాల నుంచి నిత్యం ఈ దందా సాగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. నియంత్రణ చర్యలు తీసుకోవడంలో వెనకంజ వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల అక్రమ రవాణాలపై నిబంధనలు కఠినంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సరిహద్దుల్లోనే ఎందుకు..?

తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లోనే పశువుల సంతలను ఏర్పాటుపై రవాణా సులభతరమనే వాదనలను వ్యాపారులు చెబుతున్నారు. అయితే ఇతర కారణాలు ఉన్నాయని బలంగా వినిపిస్తోంది. మహారాష్ట్రలోని చంద్రపూర్, గడ్చిరోలి, గోందియా తదితర జిల్లాల నుంచి పశువులను అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మహారాష్ట్ర నుంచి పశువులను కరీంనగర్, హైదరాబాద్ తదితర పట్ట ణాలకు రవాణా చేసేందుకు సరిహద్దుల్లోని సంతల్లో అనుమతి పత్రాలు తీసుకుంటున్నారు. ఈ అనుమతి పత్రాలతో తెలంగాణలోకి తరలిస్తున్నారు. హుడ్కిలి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న పశువుల సంత ఆది నుంచీ నామమాత్రంగా కొనసాగుతోంది. వేలం తర్వాత ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పశువు ల క్రయవిక్రయాలు నిర్వహించిన దాఖలాలు లే వు. మహారాష్ట్ర నుంచి నేరుగా వచ్చే వాహనాలను హుడ్కిలి పశువుల సంత అనుమతి పత్రాలతో పట్టణాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నా యి. వ్యాపారులు సంత వేలం దక్కించుకుని సంబంధిత పంచాయతీ నుంచి పశువుల సంత అనుమతి పత్రాల చిటీల బుక్‌లను తీసుకెళ్తున్నారు. సంత నిర్వహించే రోజుల్లోనే కాకుండా ప్రతి రోజూ సంత అనుమతి పత్రాలతో పశువులను రవాణా చేస్తున్నారు.

రాత్రివేళల్లో అధికం..

మహారాష్ట్ర గ్రామాల నుంచి నేరుగా తెలంగాణలోని పట్టణాలకు రాత్రి వేళల్లో మాత్రమే పశువులను అక్రమ రవాణా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల సిర్పూర్(టి) మండలకేంద్రంలో ఏబీవీపీ, బజరంగ్‌దళ్ సభ్యులు నాయకులు అర్ధరాత్రి పరిమితికి మించి ఒక ట్రక్కులో సుమారుగా 20కి పైగా పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను గుర్తించారు. సిర్పూర్(టి) ఎస్సైకి సమాచారం అందించగా పోలీసులు పశువుల వ్యాన్‌ను పట్టుకున్నారు. 20కి పైగా పశువులను కాగజ్‌నగర్ పట్టణంలోని గోశాలకు తరలించారు. వ్యాన్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



ఇటీవల పోలీసులు పట్టుకున్న వ్యాన్‌లో పశువులు(ఫైల్)

నేడే సత్యాగ్రహ సభ



శ్రీరాంపూర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న భట్టి విక్రమార్క, మాణిక్‌రావు ఠాక్రే

- కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ
- నస్పూర్‌లో సాయంత్రం 4గంటలకు మరూ
- ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే
- లక్షమందితో సభ సక్సెస్ చేసేలా నాయకుల ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో శుక్రవారం తలపెట్టిన 'సత్యాగ్రహ సభ'కు సర్వం సిద్ధమైంది. కొత్త కలెక్టరేట్ సమీపంలోని 22 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ స్థాయి నాయకులు తరలి వస్తుండడంతో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4గంటల నుంచి సభా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. యుద్ధనౌక గద్దర్ నేతృత్వంలో ఆటాపాట, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతుండడంతో రాష్ట్ర, జిల్లా నేతలు మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుని జన సమీకరణ చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాలతోపాటు పెద్దపల్లి, భూపాలపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి అత్యధికంగా జనం హాజరయ్యేలా రెండ్రోజుల నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా సభకు లక్ష మంది హాజరవుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

భారీగా ఏర్పాట్లు

1800 అడుగుల విస్తీర్ణంలో సభా వేదికతోపాటు ముఖ్య అతిథి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కతో సహా వర్కింగ్ ప్రెసిడెంట్లు, మాజీ మంత్రులు, రాష్ట్రంలోని సీనియర్ నాయకులు వేదికపై కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. వేసవి దృష్ట్యా టెంట్లు వేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించారు. సభ నేపథ్యంలో మంచిర్యాల–నస్పూర్ ప్రధాన రహదారి, కొత్త కలెక్టరేట్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక ఏర్పాట్లు, చలువ పందిళ్లు, పార్కింగ్ సదుపాయాలు, ఎల్‌ఈడీ తెరలు సిద్ధం చేశారు.



బహిరంగ సభ ఏర్పాట్లు

సభా ప్రాంగణానికి అంబేద్కర్ పేరు

రాజ్యాంగం రచించిన అంబేద్కర్ జయంతి రోజే సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సభా ప్రాంగణానికి బాబా సాహెబ్ అంబేద్కర్ వేదికగా నామకరణం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీకి మద్దతుగా నిర్వహిస్తున్న నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఈ సభతో తమ నిరసన తెలుపుతామని పార్టీ నాయకులు చెబుతున్నారు.

17చోట్ల భోజన వసతి

సభకు వచ్చే వారికి భోజనాలకు ఇబ్బంది లేకుండా సభ వెలుపలే 17చోట్ల ఏర్పాట్లు చేశారు. ఎస్పీఆర్ ఫంక్షన్ హాల్, ఎంవీఆర్ ఫంక్షన్ హాల్ దొనబండ, పద్మావతి గార్డెన్, వైశ్యభవన్ మంచిర్యాల బైపాస్ రోడ్డు, లారీ అసోసియేషన్, పటేల్ గార్డెన్ హమాలీవాడలోని ప్రభుత్వ పాఠశాల మైదానం, లయన్స్‌క్లబ్, తాపీ భవనం రసూల్‌పల్లి, ఎంఎస్ఆర్ గార్డెన్, ఎస్కేఆర్ గార్డెన్, సింగరేణి ఫంక్షన్ హాల్, ఇందిరమ్మ ఫ్లడ్ కాలనీ, పటేల్ నగర్‌లో భోజనాలు ఏర్పాటు చేశారు.

పాదయాత్రగా వెళ్లిన 'భట్టి'

సభ జరుగుతున్న నస్పూర్ ప్రాంతానికి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క గురువారం సాయంత్రం శ్రీరాంపూర్ ప్రగతి మైదానం నుంచి నస్పూర్ మున్సిపాలిటీ పెట్రోల్‌బంక్ వరకు పాదయాత్ర చేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వీహెచ్, సంపత్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- కాగజ్‌నగర్‌లో రంజాన్ కానుకలు పంపిణీ



రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పేద ముస్లింలకు మంజూరు చేసిన రంజాన్ కానుకలను సోమవారం పట్టణంలోని జామా మసీదు ఆవరణలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ పేదవాడి ఇంట్లో పండుగ జరగాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నివర్గాల ప్రజలకు కానుకలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునవ్వార్ షరీఫ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, ఎంఐఎం అధ్యక్షుడు అబ్దుల్ ముబీన్, నాయకులు హబీబ్, అబ్దుల్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో అంబేద్కర్ చిత్రపటం బీజేపీ ఘనతే

- పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్
- జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ



అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: పార్లమెంటులో అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసిన ఘనత బీజేపీదేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గురువారం ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేశారు. అంతకుముందు ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్ నుంచి బైక్‌ర్యాలీని ర్వహించారు. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను ప్రతిఒక్కరూ గౌరవించుకోవాలన్నారు. నాడు మెంబర్ ఆఫ్ పార్లమెంట్ పోటీ చేసినప్పుడు మద్దతుగా నిలిచింది జనసంఘ్ పార్టీ అని గుర్తు చేశారు. మోవ్‌లో అంబేద్కర్ జన్మస్థలం, ఆయన చదువుకున్న లండన్ ప్రదేశం, నాగపూర్ దీక్షా భూమి, ఢిల్లీలోని మ హా పరినిర్వాన్ స్థల్, ముంబైలోని చైతన్యభూమిని పంచతీర్థంగా అభివృద్ధి చేసిన ఘనత బీజేపీదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతి నిధి కేసరి ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి కుందా ర పు బాలకృష్ణ, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జాడి సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షులు జయరాజు, కార్యదర్శి దుర్గం విశాల్, ప్రధాన కార్యదర్శి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఇంటింటికీ సీపీఐ'

ఆసిఫాబాద్: బీజేపీ హఠావో– దేశ్‌కో బచావో నినాదంతో జిల్లాలో శుక్రవారం నుంచి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయడంతో విఫలమైందన్నారు. రైతులు, కార్మికులను విస్మరించి, కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బోగే ఉపేందర్, నాయకులు పిడుగు శంకర్, దివాకర్, చిరంజీవి, హేమాజీ, దివాకర్, కొమురక్క పాల్గొన్నారు.

సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు
- తిర్యాణిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

తిర్యాణి(ఆసిఫాబాద్): కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు అన్నారు. తిర్యాణి మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం కొత్తగా కుమురంభీం జిల్లాను ఏర్పాటు చేయడంతోపాటు జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేసిందన్నారు. తద్వారా జిల్లాలో మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ప్రత్యేకంగా గురుకులాలను ప్రారంభిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.50 లక్షల మందికి త్వరలోనే పోడు భూములకు సంబంధించిన పట్టాలు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు త్వరలోనే రోడ్ల నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. మరిన్ని డీఎంఎఫ్‌టీ నిధులు తీసుకువచ్చి అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటామన్నారు. గిరిజన గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కుమురంభీం చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో మరింత వృద్ధి సాధించాలి



మట్టిపాత్రలను పరిశీలిస్తున్న ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, జిల్లా బీసీ అధికారి సత్యనారాయణరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): మట్టి పాత్రల శిక్షణతో సాధించిన నైపుణ్యంతో కుమ్మరులు ఆర్థికంగా మరింత వృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండలంలోని కైరిగాంలో కొనసాగుతున్న మట్టి పాత్రల శిక్షణ ముగియడంతో మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం ముగింపు సభను నిర్వహించారు. ప్రదర్శనలో ఉంచిన మట్టి పాత్రలను అదనపు కలెక్టర్, ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, జిల్లా బీసీ అధికారి సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు విడతల్లో 184 మందికి మట్టి పాత్రల తయారీపై ప్రత్యేక శిక్షణ అందించామని తెలిపారు. త్వరలో 100 మందికి ఎలక్ట్రికల్ సారె యంత్రాలు అందజేస్తామన్నారు. రూ.12లక్షలతో సాలెగూడలో మట్టియంత్రాలతో కుటీర పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రాంతాలతోపాటు జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో మట్టి పాత్రలను విక్రయించేందుకు ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శి మొండి, జిల్లా కార్యదర్శి మహేశ్, సంతోష్, తిరుపతి, నగేశ్, సురేశ్, రమేశ్, మహిళా అధ్యక్షులు రాజక్క తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తిరుపతి(38) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. వివరాల ప్రకారం... తిరుపతి భార్య గత కొద్ది రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురై అతిగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైన్స్‌లో దొంగతనం కేసులో మరొకరి రిమాండ్

కాసిపేట: ఆర్‌ఎస్ వైన్స్‌లో గత నెల 19న సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, షట్టర్లు పగలగొట్టి దొంగతనం చేసిన కేసులో కరీంనగర్ జిల్లా వావిలాలపల్లికి చెందిన ఎండీ గౌస్‌పాషాను గురువారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. మార్చి 19న జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు నిందితుల్లో ఈ నెల 3న మహ్మద్ షమీర్, అబ్దుల్ షాకీబ్‌ను ఇప్పటికే రిమాండ్ చేశామన్నారు. పరారీలో ఉన్న గౌస్‌పాషా గురువారం సోమగూడెంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నామని తెలిపారు. విచారణలో మరో చోరీకి రెక్కీ నిర్వహించేందుకు వచ్చినట్లు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.

బెల్లంపల్లిలో మరో ఐదుగురికి కరోనా

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రాంతంలో కరోనా మళ్లీ విజృంభిస్తోంది. గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అనుమానితులు పరీక్షించుకోగా ఐదుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. 18 మందికి పరీక్షలు చేసినట్లు ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి. ఇందులో బెల్లంపల్లి బజారు ఏరియా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తితో పాటు గంగారం నగర్ చెందిన ఒకరికి, తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో ఒకరికి, కాసిపేట మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. బుధవారం బెల్లంపల్లిలో ముగ్గురికి కరోనా సోకిన విషయం తెలిసిందే. దీంతో రెండు రోజుల వ్యవధిలో బెల్లంపల్లి ప్రాంతంలో 8 మందికి కరోనా సోకింది.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

బోథ్: మండలంలోని బా ర గ్రామానికి చెందిన ఆత్రం కాశీరాం(46) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశీరాం తనకున్న మూడున్నర ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నాడు. పత్తి, సోయా పంటను వేశాడు. దిగుబడి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ప్రైవేటుగా రూ.లక్ష, బ్యాంకులో మరో రూ.లక్ష వరకు అప్పు ఉండడంతో ఎలా తీర్చాలో తెలియక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు ఆత్రం దిగంబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

- భూ వివాదమే కారణం..
- పథకం ప్రకారమే కత్తులతో దాడి..
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీసీపీ


నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపీ, ఇతర అధికారులు

రామకృష్ణాపూర్: రియల్ ఎస్టేట్ వ్యాపారి నడిపెల్లి లక్ష్మీకాంతరావును హత్యచేసిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాంనాథ్ కెకాన్ వివరాలు వెల్లడించాడు. మంచిర్యాలకు చెందిన లక్ష్మీకాంతరావు కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో రామకృష్ణాపూర్‌కు చెందిన మామిడి శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. అయితే 2019లో లక్ష్మీకాంతరావు, అతడి భార్యతో పాటు మరో నలుగురి పేరిట సీసీసీలోని తీగల్‌పహాడ్ వద్ద ఉన్న ఐదు ఎకరాల 21 గుంటల భూమిని మామిడి శ్రీనివాస్ కొనుగోలు చేశాడు. ఆ సమయంలో రూ.30లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నాడు. అయినప్పటికీ రిజిస్ట్రేషన్ మాత్రం చేయటం లేదు. మిగిలిన వారు రిజిస్ట్రేషన్‌కు సుముఖంగా ఉన్నప్పటికీ లక్ష్మీకాంతరావు మాత్రం దాటవేస్తూ వస్తున్నాడు. దీంతో శ్రీనివాస్ కోపం పెంచుకుని హత్యకు పతకం రచించాడు.

మరో శ్రీనివాస్‌తో కలిసి...

కొంతకాలంగా భూమి రిజిస్ట్రేషన్ పేరిట జాప్యం చేస్తూ వస్తున్న లక్ష్మీకాంతరావును హత్య చేయాలని మామిడి శ్రీనివాస్ నిర్ణయించుకున్నాడు. మంచిర్యాలలోని సంజీవయ్యకాలనీకి చెందిన దాసరి శ్రీనివాస్ సాయం తీసుకున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని లక్ష్మీకాంతరావుకు చెందిన ఓ ప్లాట్‌లో మరో వ్యక్తి సెంట్రింగ్ పనులు చేస్తున్నాడని, దానిని కూలగొడితే రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పడంతో ఈ నెల 11న ఉదయం మామిడి శ్రీనివాస్ దానిని కూలగొట్టడానికి దాసరి శ్రీనివాస్‌తో కలిసి వెళ్లాడు. సెంట్రింగ్ కూలగొట్టి లక్ష్మీకాంతరావుకు అక్కడి నుంచి ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయాలని కోరాడు. మళ్లీ దాటవేసే సమాధానం చెప్పడంతో ఇక్కడికి వస్తే మాట్లాడుకుందామని లక్ష్మీకాంతరావును రప్పించాడు. అక్కడికి రాగానే దాసరి శ్రీనివాస్‌ను ఎవరూ రాకుండా చూడాలని చెప్పి ప్లాట్ లోపలకి తీసుకెళ్లి కత్తితో లక్ష్మీకాంతరావుపై దాడి చేశాడు. అనంతరం వారు తెచ్చుకున్న ద్విచక్ర వాహనం అక్కడే వదిలి ఇద్దరు శ్రీనివాస్‌లు పారిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మామిడి శ్రీనివాస్‌ను బస్టాండ్ సమీపంలో గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసును బెల్లంపల్లి ఏసీపీ సదయ్య ఆధ్వర్యంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు అశోక్(రామకృష్ణాపూర్) విజేందర్(దేవాపూర్) త్వరగా ఛేదించడంతో వారిని డీసీపీ అభినందించారు.

హెల్త్ అసిస్టెంట్ ఆత్మహత్య

- నెన్నెల పీహెచ్‌సీలో టాయిలెట్ క్లీనర్ తాగిన కిరణ్‌కుమార్
- బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- డాక్టర్ వేధింపులే కారణమని ఆరోపణలు


కిరణ్‌కుమార్ మృతదేహం

నెన్నెల: మండలంలోని మైలారం సబ్ సెంటర్ హెల్త్‌అసిస్టెంట్ వేల్పుల కిరణ్‌కుమార్(46) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బాత్రూంలో టాయిలెట్ క్లీనర్ తాగాడు. 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీరాణి వేధింపులే కారణమని మృతుడి భార్య దీప్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడి భార్య, పోలీసుల కథనం ప్రకారం.. కిరణ్‌కుమార్ పదేళ్లుగా మైలారం సబ్‌సెంటర్‌లో హెల్త్‌అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. జనవరి 12న రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకున్న తర్వాత ఇటీవల విధుల్లో చేరాడు. ఇతరుల సాయంతో విధులకు హాజరవుతుండగా.. సబ్ సెంటర్‌తోపాటు ప్రతీ గురువారం నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌లో విధులు నిర్వర్తించాలని డాక్టర్ సూచించారు. ఆరోగ్యం సహకరించక పోవడంతో ఈ నెల 6న విధులకు హాజరు కాలేదని, 10న వెళ్లిన కిరణ్‌ను సిబ్బంది ఎదుటనే డ్యూటీ చేయడం చేతకాదని, ఇక రానవసరం లేదంటూ డాక్టర్ మందలించిందని కిరణ్‌కుమార్ భార్య దీప్తి ఆరోపించింది. గురువారం విధులకు వెళ్లగా డీఎంహెచ్‌వో నుంచి లెటర్ తెస్తేనే డ్యూటీ చేయాలని చెప్పడంతో మనస్తాపం చెంది బాత్రూం క్లీనింగ్ లిక్విడ్ తాగాడని పేర్కొంది. మెడికల్ ఆఫీసర్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ చేసి చెప్పాడని రోదిస్తూ తెలిపింది. ఈ విషయమై డాక్టర్ ఝాన్సీరాణిని సంప్రదించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ గురువారం నెన్నెల పీహెచ్‌సీలో గర్భిణులకు పరీక్షలు ఉంటాయని ఇక్కడే డ్యూటీ చేయమన్నానని చెప్పారు. గురువారం ఎందుకు రాలేదని, సమాచారం ఎందుకు ఇవ్వలేదని సిబ్బంది సమక్షంలో ప్రశ్నించానని, వేధింపులకు గురి చేయలేదని తెలిపారు. కాగా, మృతుడికి భార్య, కూతురు వేరోణిక ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని నెన్నెల ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన


డీఎంహెచ్‌వోను నిలదీస్తున్న కుటుంబ సభ్యులు

బెల్లంపల్లి: పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న నెన్నెల మండల కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ వేల్పుల కిరణ్ కుమార్ మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి తీసుకెళ్లకుండా గురువారం రాత్రి మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. నెన్నెల పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ ఝాన్సీ రాణి వేధింపులతోనే కిరణ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని, వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆసుపత్రి ఆవరణలో బైఠాయించారు. సమాచారం అందుకున్న డీఎంఅండ్ హెచ్ సుబ్బారాయుడు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబానికి నచ్చచెప్పేందుకు ప్రయత్నించగా బంధువులు నిరాకరించారు. మెడికల్ అధికారినిపై చర్యలు తీసుకోవాలని తన భర్త కిరణ్‌కుమార్ డీఎంహెచ్‌వోకు, డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయ పూర్ణిమకు గతంలో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని బుల్యా దీప్తి మండిపడింది. వారిపై సైతం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో డీఎంహెచ్‌వో అక్కడి నుంచి వెళ్లేందుకు సిద్ధపడగా బాధితులు కారు ఎదుట బైఠాయించారు. బాధితులకు బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు కొయ్యల ఏమాజీ, సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్రనాయకుడు ఉదయ్‌కాంత్ సంఘీభావం ప్రకటించి బాసటగా నిలిచారు. దీంతో ఓ దశలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. చివరకు వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య వైద్యాధికారులతో సంప్రదింపులు జరిపి ఆందోళనకు తెరదించేలా కృషి చేశారు. దీంతో జిల్లా వైద్యాధికారులు రూ.40వేలు తక్షణసాయంగా అందించడంతో బాధిత కుటుంబీకులు శాంతించి మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువెళ్లారు. ఆందోళన రాత్రి 10-30 గంటల వరకు కొనసాగింది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐలు రాజ్‌కుమార్‌గౌడ్, శంకరయ్య, జగదీష్ పర్యవేక్షించారు.

పట్టపగలే దొంగతనం

- ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీ


విచారణ చేస్తున్న సీఐ షాదీక్‌పాషా, ఎస్సై ప్రవీణ్

కౌటాల: మండల కేంద్రంలో గురువారం పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలోని ఓ ఇంట్లో పట్టపగలే దొంగతనం జరిగింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. స్థానిక ప్రగతి కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల హెచ్‌ఎం దుర్గం గోపాల్, అతడి భార్య సవిత ఏఎన్‌ఎంగా పని చేస్తున్నారు. గురువారం ఉదయం భార్యాభర్తలు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. ఈ క్రమంలో దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 5 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన దంపతులు దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి సీఐ షాదీక్ పాషా, ఎస్సై ప్రవీణ్‌కుమార్ చేరుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుడు దుర్గం గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నవోదయ 9వ తరగతి ఫలితాలు విడుదల

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఐదు ఖాళీ సీట్లకు ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహించగా ప్రతిభ, రిజర్వేషన్‌ల ప్రాతిపదికన విద్యాలయ సమితి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఓపెన్ కోటాలో చోలె పార్థ (271024), ఓపెన్ ఎస్సీ కోటాలో కె.వినయ్ (271397), రూరల్‌కోటాలో నోముల ఆశ్మిత (271513), రూరల్ బాలికల ఓబీసీ కోటాలో ప్రీతి (271310), దివ్యాంగుల కోటాలో కె.అభిషేక్ (271281) ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 17న తమ ధ్రువీకరణ పత్రాలతో విద్యాలయానికి రావాలని సూచించారు.

పరీక్ష కేంద్రానికి వీల్‌చైర్‌లో...


వీల్‌చైర్‌లో దివ్యాంగుడిని తీసుకెళ్తున్న కళాశాల సబార్డినేటర్ మనోజ్‌కుమార్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంబీఏ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు నడుస్తున్నాయి. పరీక్షలు రాసేందుకు పుట్టుకతో రెండు కాళ్లు అంగవైకల్యం కలిగిన మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడకు చెందిన సాయికిరణ్‌ఠాకూర్ ములకలలోని కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. సాయికిరణ్ తండ్రి హన్మన్ సింగ్ ఆటో డ్రైవర్ కాగా తన ఆటోలో కేంద్రానికి తీసుకొచ్చాడు. గమనించిన కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి విద్యార్థి పరీక్ష కేంద్రానికి వీల్‌చైర్‌లో తీసుకెళ్లాడు. కళాశాల సబార్డినేటర్ మనోజ్‌కుమార్‌ను కళాశాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

సీఓఈ సెట్ ఫలితాల్లో గురుకుల విద్యార్థినులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు సీఓఈ సెట్ -2023 పరీక్ష ఫలితాల్లో విజయం సాధించారు. ఆరుగురు బాలికలు ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్రంలోని ప్రఖ్యాత సీఓఈల్లో సీటు దక్కించుకున్నారు. ఇందులో ఇ.అశ్విత (ఎంపీసీ - అలనూర్ సీఓఈ), డి.స్వప్న (బైపీసీ - అల్గనూర్ సీఓఈ)లో సీటు కైవసం చేసుకోగా, ఐ.సాయి లిఖిత, సీ.హెచ్ సోనాలి, డి.కల్పన (బైపీసీ - గౌలి దొడ్డి) సీఓఈ లో సీటు దక్కించుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప గురువారం తెలిపారు.

ఎఫ్‌ఆర్వోపై దాడి కేసులో 12 మందిపై కేసు

ఇచ్చోడ: టైగర్‌జోన్ ఎఫ్‌ఆర్వో వాహబ్ అహ్మద్‌పై దాడి చేసిన సంఘటనలో గురువారం నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నట్లు ఇచ్చోడ సీఐ ముదావత్ నైలు తెలిపారు. గురువారం వివరాలను వెల్లడించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన వ్యక్తి అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా టైగర్‌జోన్ ఎఫ్‌ఆర్వో సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఈ సంఘటనలో ట్రాక్టర్ యాజమానితో పాటు ఆయన బంధువులు ఎఫ్‌ఆర్వో పై దాడికి పాల్పడ్డారు. ఎఫ్‌ఆర్‌వో ఫిర్యాదు మేరకు విచారణలో భాగంగా 12 మందిపై కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో తొమ్మిది మంది పరారీలు ఉన్నట్లు చెప్పాడు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు, ఎస్సై విజయ్

పెంచికల్‌పేట్: అనుమానంతో భార్యను హత్య చేసిన మురళీగూడ గ్రామానికి చెందిన కామెర శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మురళీగూడ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు మహారాష్ట్రలోని దర్శవాడకు చెందిన లక్ష్మితో 18సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా తాగుడికి బానిసై ఇంట్లో గొడవపడేవాడు. ఇటీవల పిల్లలు బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. ఈ నెల 9వ తేదీన భార్యాభర్తలకు వివాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో భార్య లక్ష్మిని తీవ్రంగా కొట్టడంతో మృతిచెందింది. అనంతరం భార్య మూర్ఛవ్యాధితో చనిపోయిందని గ్రామస్తులను నమ్మించే ప్రయత్నం చేయగా మృతురాలి అక్క వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు భర్త శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఎస్సై విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమిస్తే జైలులో పెడతారా


ఓపెన్‌కాస్ట్ బాధితులతో బీజేపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: హక్కుల కోసం ఉద్యమిస్తే జైలులో పెడతారా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ ప్రశ్నించారు. ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని సింగరేణి కార్యాలయం ఎదుట 15 రోజుల క్రితం సింగరేణి భూ నిర్వాసితులు ఆందోళన నిర్వహించారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంట్రాక్టర్ మోసం చేశారని ప్రశ్నించారు. దీంతో వారిని అరెస్టు చేసి జైలుపాలు చేయడం సరికాదని మండిపడ్డారు. గురువారం బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన 35మంది బాధితులను పూలమాలలతో సన్మానించారు. హామీలు నెరవేర్చకుండా సామాన్య ప్రజలు, పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని మండిపడ్డారు. నిర్వాసితులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకురాలు సుహాసిని రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో భారీగా మట్టితవ్వకాలు

- రాత్రిపూట టిప్పర్లతో తరలింపు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ శివారులో క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి మట్టి తవ్వకాలు జరిపారు. ప్రభుత్వ భూమి (సర్వే నంబర్ 31)లో బొక్కలగుట్ట గ్రామంతో పాటు కోటేశ్వర్‌రావుపల్లె, పులిమడుగు గ్రామాలకు కలిపి కేటాయించిన క్రీడా ప్రాంగణంలో మట్టి తవ్వకాలను స్థానికులు గుర్తించి గురువారం ఉదయం రెవెన్యూ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను గుర్తించి నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఇంత పెద్ద మొత్తంలో మట్టి తవ్వకాలు జరుపుతుంటే ఏం చేస్తున్నారని మండల రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తవ్వకాలు చేపట్టిన వారిపై కేసు నమోదుకు వెనుకాడొద్దని, మైనింగ్ అధికారుల దృష్టికి ఘటనను తీసుకెళ్లాలని సూచించారు. ఆర్డీవో వేణు, ఆర్‌ఐ నవీత్ తదితరులు ఉన్నారు.

కాసిపేట2 గనిలో కార్మికుడికి గాయాలు


కార్మికుడిని పరామర్శిస్తున్న జీఎం, నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిలో గురువారం తెల్లవారు జామున బదిలీ వర్కర్ మెరుగు శ్రీకాంత్ ప్రమాదవశాత్తు కింద పడటంతో చేతి విరిగింది. తోటి కార్మికులకు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి షిఫ్టులో గురువారం తెల్లవారు జామున ఇండలెస్(ఎల్‌ఎస్) కుక్కకట్టి సమయంలో రాడ్ రియాక్షన్‌తో తిరిగి కొట్టడంతో కింద పడిపోయాడు. వెంటనే అతడిని రామకృష్ణపూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌ది కుడిచేయి విరిగిపోయింది. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, రామకృష్ణపూర్ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ, కాసిపేట2 పిట్ కార్యదర్శి గోల్ల శ్రీనివాస్, నాయకులు బొద్దుల వెంకటేష్, లింగమూర్తి ఆస్పత్రిలో గాయాలైన కార్మికుడిని పరామర్శించారు. అలాగే మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి శ్రీకాంత్‌ను సంఘటనకు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అతడి వెంట ఏరియా రక్షణాధికారి ఓదెలు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి ఉన్నారు.

ఉత్తమ రైతుగా ఆలుగామ వాసి


అవార్డుతో కుమ్మరి కిష్టయ్య

కోటపల్లి: కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ 39వ ఫౌండేషన్ డే సందర్భంగా మండలంలోని ఆలుగామ గ్రామానికి చెందిన కుమ్మరి కిష్టయ్యకు కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ డైరెక్టర్ అఫ్ జనరల్ న్యూఢిల్లీ త్రిలోచన్ ముహాపాత్ర, డైరెక్టర్ వీకే సింగ్‌లు ఉత్తమ రైతు అవార్డును హైదరాబాద్ బుధవారం అందజేశారు. కుమ్మరి కిష్టయ్య మిర్చి పంటలో అంతరపంటగా వేరుశనగ వేసి అధిక దిగుబడులు పొందడంతో ఈ అవార్డును అందజేసినట్లు సంస్థ నోడల్ ఆఫీసర్ శాస్త్రవేత్త టి.వి ప్రసాద్ తెలిపారు.

ఎస్‌సీఎల్‌యూ కేంద్ర కార్యదర్శిగా శేఖర్


శేఖర్‌కు నియామకపత్రం ఇస్తున్న జనక్ ప్రసాద్

బెల్లంపల్లి: సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) కేంద్ర కార్యదర్శిగా బెల్లంపల్లికి చెందిన ఆరకొండ శేఖర్ నియామకమాయ్యరు. ఈ మేరకు గురువారం ఐఎన్‌టీయూసీ సింగరేణి విభాగం సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ నియామక పత్రాన్ని శేఖర్‌కు అందజేశారు. సింగరేణిలో ఐఎన్‌టీయూసీని నిర్మాణపరంగా బలోపేతం చేయడానికి, కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి తన వంతు పాత్ర పోషించాలని జనక్‌ప్రసాద్ సూచించారు. తనపై విశ్వాసం ఉంచి కేంద్ర కార్యదర్శిగా నియమించిన అధినాయకులకు శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

117 క్వార్టర్ల కేటాయింపు

శ్రీరాంపూర్: సీనియారిటీ ఆధారంగా శ్రీరాంపూర్‌లో 117 మంది ఉద్యోగులకు కంపెనీ క్వార్టర్లను కేటాయించారు. గురువారం ప్రగతి మైదానంలో ఈ క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 187 క్వార్టర్లను కౌన్సెలింగ్‌లో పెట్టగా ఇందులో 117 క్వార్టర్లను ఉద్యోగులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, పీఎం రాజేశ్వర్, ఈఈ గుండె రావు, సీనియర్ పీఓ రాజేశ్వర్‌రావులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరికి జైలు

మంచిర్యాలక్రైం: లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2018 అక్టోబర్ 4న నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎం.సతీశ్‌కుమార్ తీర్పునిచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. బాలసాని చంద్రశేఖర్ గౌడ్ నుంచి లక్సెట్టిపేటకు చెందిన పెందం శ్రీలత మాంగళ్య బట్టల దుకాణం రూ.20 లక్షలకు కొనుగోలు చేసి అప్సర సెలక్షన్స్ పేరుతో వ్యాపారం సాగిస్తోంది. భవన యజమానులు ఎంఏ రహీం, ఎంఏ సలీంలకు ఒప్పందం ప్రకారం రూ.18 వేల అద్దె చెల్లిస్తోంది. కొన్ని నెలల తర్వాత అదనంగా అద్దె చెల్లించాలని యజమానులు శ్రీలతను వేధించడం ప్రారంభించారు. 2018 ఆగస్టు 24న శ్రీలతను కులం పేరుతో దూషిస్తూ దుకాణానికి తాళం వేశారు. అనంతరం షాపును మహవీర్ ఎంటర్‌ప్రైజెస్ నరేశ్‌కు అప్పగించారు. బాధితురాలు నరేశ్ వద్దకు వెళ్లి షాపు తాళాలు మీకెవరు ఇచ్చారని ప్రశ్నించింది. గోదాంకు వెళ్లి పరిశీలించగా రూ.ఐదు లక్షల విలువైన చీరలు కనిపించడం లేదని గుర్తించింది. భవన యజమానులు రహీం, సలీంలపై అనుమానం వ్యక్తం చేస్తూ, అగ్రిమెంట్ కాలం పూర్తి కాకముందే షాపును మరొక్కరికి అప్పగించారని ఆరోపిస్తూ లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితులను కోర్టులో హాజరుపర్చగా 17 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో ఎంఏ రహీం, ఎంఏ సలీంలకు ఏడాది జైలు, రూ.1000 జరిమానా విధించారు.

ప్రైవేట్ ఆస్పత్రికి అనుమతి ఇవ్వొద్దని ఫిర్యాదు


ఫిర్యాదు పత్రాన్ని అందిస్తున్న సూరిబాబు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎదుట నిర్మాణం చేస్తున్న ఓ కమర్షియల్ కాంప్లెక్‌లో ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహణకు అనుమతి ఇవ్వవద్దని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమూరి సూరిబాబు గురువారం ఫిర్యాదు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ ప్రభుత్వ భూమిలో ఉందని, కోర్టు ఆదేశాలతో ఓసారి ఆ కాంప్లెక్స్‌ను కూల్చి వేయించారని, వివాదంగా మారిన ఆ కాంప్లెక్స్‌లో ప్రైవేట్ ఆసుపత్రిని నిర్వహించడానికి అనుమతి నిరాకరించాలని సూరిబాబు పేర్కొన్నాడు. ఈ మేరకు డీఎంఅండ్ హెచ్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.